# కథాకేళి

శ్రీధర్ ఆ గదిలో అద్దెకి దిగిన నెల రోజుల్లో ఆమె పేరు లలిత అని, ఆమె భర్త పేరు రాజయ్య అని తెలుసుకున్నాడు. ఆమెకి వివాహం అయి పన్నెండేళ్లు దాటుతోందని, వాళ్లకి పిల్లలు లేరని కూడా పనిమనిషి చెప్పింది. పిల్లల కోసం రాజయ్యకి తాపత్రయం లేక పోయినా లలితకి ఇంకా మనసు పోలేదని కూడా అరవై రెండేళ్ల పనిమనిషి చెప్పింది.

వాళ్లిద్దరూ డాక్టర్ దగ్గర ఆరేళ్ల క్రితం పరీక్షలు చేయించుకున్నారని, ఎవరి లోనూ ఎలాంటి లోపం లేదని తేలిందని కూడా పనిమనిషి చెప్పింది. తరువాత రహస్యం చెప్తున్నట్టుగా చెప్పింది ఆవిడ-



'రాజయ్యలోనే వుందిట లోపం. ఆయన బాధపడతాడని డాక్టర్ అబద్ధం చెప్పాడట.

ఆ రెండు ఇళ్లల్లో పనిచేసే పనిమనిషి కాబట్టి ఆవిడ అక్కడ సంగతులు ఇక్కడ, ఇక్కడ సంగతులు అక్కడ చేరుస్తూంటుంది.

లలితతో చెప్పింది.-

'పేరు శ్రీధర్ట. ఎల్.ఐ.సి.లో భార్యకి పని. ఇతనికి ఇక్కడికి బదిలీ అయింది. మళ్లీ వాళ్ల వూరికి బదిలీ చేయించుకోడానికి ప్రయత్నిస్తున్నాడట. ఓ రెండు, మూడు నెలల్లో వెళ్లి పోతాడట. ముగ్గురు అమ్మాయిలుట. భార్య మళ్లీ గర్భవతట. ఈసారైనా కొడుకు పుడితే బావుండునని మొక్కుకున్నాడుట. ముగ్గురులో ఒక్క కొడుకున్నా ఆపరేషన్ చేయించుకునేవారుట. బహు నెమ్మదస్తుడు. మంచివాడు.

తన పనేమిటో తనది తప్ప ఇతరుల జోలికి పోడు. మంచి వంశం. అన్నయ్య అమెరికాలో డాక్టర్. తమ్ముడు శ్రీహరి కోటలో సైంటిస్ట్. అక్కయ్య ఐ.ఎ.ఎస్.-డిప్యూటీ కలెక్టర్ట. లిప్టం కంపెనీకి రీజియనల్ మేనేజర్...'

లలితలో తళుక్కున కలిగిన ఆలోచన. క్రమంగా అది కోరికగా మారింది. ముందుగా భయం వేసినా తర్వాత 'అలా ఎందుకు చేయగూడదు?' అనుకుంది. 'వేద కాలంలో ఇలాంటివి సమర్థనీయమే అయినప్పుడు ఇప్పుడెందుకు కాకూడదు?' అని తర్కించుకుని తన మనసుకి సమాధానం చెప్పుకుంది.

చివరికి ధైర్యం చేసింది. పన్నెండేళ్లుగా నమ్మకస్థురాలైన పనిమనిషితో చెప్పింది తన ఆలోచన. జీవితంలో అన్ని రకాలైన కష్టాలని చవిచూసిన పనిమనిషి వెంటనే చెప్పింది-

'అమ్మగారు. నేనే ఈ ముక్క మీతో అందామనుకున్నాను గాని మీరేమంటారో అని చెప్పలేదు. తప్పులేదు.'

'ఆయన్ని అడిగి చూడు' చెప్పింది లలిత. 'అడుగుతాను. భార్య దగ్గరకి వెళ్లాడు. ఎల్లుండి వస్తాడు'

'వస్తుంటే వచ్చే సోమవారం రాత్రి అతని గదికి వెళ్తాను. మీ అయ్యగారు కేంప్‌కి వెళ్తారు.'

'అలాగే' 'ఈ విషయం నీలోనే వుంచుకోవాలి ఆగమ్మ. ఇతరులకి తెలిసిందా...' 'ఎంతమాట. రుణము, రంకు బయటకి తెలీకూడదని నాకు తెలుసమ్మా.'

'రంకు' అన్న పదం ఆగమ్మ వుపయోగించడం లలితకి నచ్చ లేదు. మనసు కలుక్కు మంది.

శ్రీధర్ తిరిగి వచ్చాక ఆగమ్మ ఆ విషయం అతని చెవిన వేసింది. ఏ మగాడు వప్పుకోడు?

రాజయ్య అనుకున్నట్టుగానే కేంప్‌కి వెళ్లాడు. శ్రీధర్ ఇంటికి సోమవారం రాత్రి ఏడున్నరకి లలిత వచ్చింది.

'కేవలం పిల్లల కోసమే' చెప్పింది లలిత తల వంచుకుని.

'నాకు తెలుసు' సానుభూతిగా చెప్పాడు శ్రీధర్.

'మీరు ఎక్కువ కాలం ఈ వూళ్లో వుండరు. పైగా మీవాళ్లంతా చదువుకున్న వారు. తెలివైన వాళ్లు. మంచి సంతానం కోసం మీరు...' ఆగిపోయింది.

చిన్నగా నవ్వాడు. ఇద్దరికీ బెరుకుగానే వుంది ముందుకు సాగడానికి. ఇద్దరి మధ్య నిశ్శబ్దం. అది ఇబ్బందికరంగా మారాక చెప్పాడు శ్రీధర్ తమ మధ్య కొత్తదనం పోవడానికి.

'ఇదిగోండి మా ఆల్బం. చూడండి.'

లలిత చేతివేళ్లని కావాలని తాకాడు ఆల్బం అందిస్తూ. ఒక్కో పేజీ తిరగేసింది. శ్రీధర్ పిల్లల ఫోటోలే అధికంగా వున్నాయి. వాటిని తేరిపార చూసింది లలిత. ఆల్బం చూసేసాక చెప్పింది తన నడుం చుట్టూ చేతిని వేసిన శ్రీధర్ నించి దూరంగా జరిగి-

'క్షమించండి. మనసు మార్చుకున్నాను.'

'ఏం?' ఆశ్చర్యపోయాడు.

జవాబు చెప్పకుండా వెళ్లిపోయింది. ఆల్బం తీసి చూశాడు ఎందుకో అని. అతనికి బోధపడలేదు.

మర్నాడు వుదయం ఆగమ్మ వచ్చి ఆల్బం అడిగి తీసుకుని చూసింది.

'మీ అమ్మగారు మనసెందుకు మార్చుకుంది?' అడిగాడు శ్రీధర్ ఆవిడని.

'ముగ్గురు పిల్లలకి స్పష్టంగా మీ పోలికే, రేపు లలితమ్మకి కూడా మీ పోలికగల పిల్లో, పిల్లాడో పుడితె ఇంకేమైనా వుందా? ఈ సందులో అందరూ ఏం అనుకుంటారు ఆయమ్మ గురించి?? ఇంకా నయం' చెప్పింది ఆగమ్మ ■

**మల్లాది వెంకట కృష్ణమూర్తి**